క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్ మంగయ్యకు అభినందన



మంగయ్యను అభినందిస్తున్న అధికారులు

పాల్వంచ: ఈ నెల 1, 2 తేదీల్లో కేటీపీఎస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పి.మంగయ్య ప్రతిభ కనబర్చాడు. డబుల్స్‌లో కేటీపీఎస్ ఏడీఈ ధర్మారావుతో పాటు హెడ్ కానిస్టేబుల్ పి.మంగయ్య ప్రథమ స్థానంలో నిలిచారు. సింగిల్స్‌లో మంగయ్య తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు. సోమవారం కేటీపీఎస్ అసిస్టెంట్ కమాండెంట్ కార్యాలయంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎ.అప్పాజీ మంగయ్యను అభినందించారు. ఇన్‌స్పెక్టర్ డి.కిరణ్, ఎస్‌ఐ హరిచంద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



లిఖిత్‌తేజకు బహుమతి అందిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

పాల్వంచ: స్థానిక కేటీపీఎస్ ఇండోర్ స్టేడియం టీఆర్‌సీక్లబ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్-11 సింగిల్స్‌లో ఇసనపల్లి కార్తీక్ ప్రథమ బహుమతి, డబుల్స్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. అండర్-15 సింగిల్స్‌లో చిరుతాని లిఖిత్‌తేజ ద్వితీయస్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రవి, కోచ్‌లు నారందాసు వెంకటేశ్వర్లు, అబ్జల్, సుజీశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతికి సంతాపం

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ నాయకులగూడెం గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ముక్కాళ్ల కృష్ణారెడ్డి (95) సోమవారం మృతి చెందగా ఎన్డీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, తుపాకుల నాగేశ్వరరావు, సారంగం పాణి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీఎండీకి వినతి

సింగరేణి(కొత్తగూడెం): కారుణ్య నియామకం కోసం తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని సీఎండీ ఎన్.బలరామ్‌కు మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుడి కుటుంబ సభ్యుడు కంప సురేశ్ వినతిపత్రం అందజేశారు. తన మామ అయిన పిక్కల ఐలయ్య ఆర్జీ - 1 ఏరియాలోని జీడీకే - 1, త్రీ ఇంక్లయిన్ గనిలో ఎస్‌డీఎల్/ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్‌గా పనిచేసి 2019లో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయ్యారని, ఆయన ఉద్యోగం తాను చేసేందుకు ఆయన రెండో కుమార్తెను వివాహం చేసుకున్నానని, తనకు 40 శాతం సదరమ్ సర్టిఫికెట్ ఉన్నందున తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని, దివ్యాంగుల కోటా కింద ఉద్యోగం ఇప్పించాలని సురేశ్ కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన సీఎండీ బలరాం నివేదికతో సీఎంఓను సంప్రదించాలని సూచించారు.

మా సాగు.. సాగేదెలా ?

- ఆవు మృతితో కుటుంబం కన్నీరుమున్నీరు



మృతిచెందిన ఆవు వద్ద రోదిస్తున్న బాధితులు

టేకులపల్లి: సకాలంలో వైద్యం అందక ఆవు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. వివరాలు... టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ సింగ్యాతండాకు చెందిన ఆంగోతు తావున వ్యవసాయ పనుల కోసం ఇటీవల రూ.50వేలు పెట్టి ఆవు కొనుగోలు చేశాడు. సోమవారం ఉదయం ఉన్నట్టుండి ఆవు అనారోగ్యం బారిన పడగా నడవలేక కింద పడింది. దీంతో రైతు కుమారుడు టేకులపల్లిలోని పశువుల ఆస్పత్రికి వెళ్లి విషయాన్ని వివరించగా ఆస్పత్రి నుంచి ఎవరూ రాలేదు. దీంతో వైద్యుడికి ఫోన్ చేస్తే తాను ఆళ్లపల్లిలో ఉన్నానని సమాధానం చెప్పాడు. ఇంతలోనే అనారోగ్యంతో తల్లడిల్లిన ఆవు మృత్యువాత పడింది. ఆతర్వాత ఆస్పత్రి నుంచి సిబ్బంది వచ్చారని, సకాలంలో వైద్యం అందిస్తే ఆవు బతికేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కన్నుమూసిన ఆవు వద్ద బాధిత కుటుంబం రోదించిన తీరు స్థానికులను కంట తడి పెట్టించింది.

ఇక దూసుకుపోవడమే..

ఇల్లెందులో విశాలమైన రోడ్లు!
- ఇరువైపులా డ్రెయిన్ వరకు విస్తరణ
- ఆపై ఫుట్‌పాత్‌ల నిర్మాణం కూడా..
- దుమ్మూధూళికి చరమగీతం.. ప్రమాదాలకు చెక్



ఇల్లెందు పట్టణంలో రోడ్డును విస్తరించి సీసీ వేస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇక ఇల్లెందులో విశాలమైన రోడ్లు అందుబాటులోకి రానున్నాయి. అందుకు తగినట్లు రూ.కోటి నిధులతో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయి. నిన్నటి వరకు ఇరుకు రోడ్లు, ఫలితంగా తరచుగా ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు దిగితే మట్టి, దుమ్ము, ధూళి కనిపించేవి. కానీ వీటన్నింటికీ ఇక చెక్ పడినట్లే. ఇక మీదట ప్రధాన రహదారి అంతా విస్తరిస్తుండటంతో వాహనదారుల ఇబ్బందులు తీరడమే కాక దుమ్మూ, ధూళికి చరమగీతం పాడినట్లవుతుంది.

రహదారుల విస్తరణ..

రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ వరకు రోడ్డు విస్తరణ (రోడ్ వైడెనింగ్) చేపట్టారు. రోడ్డు విస్తరణ వల్ల పట్టణంలోని ప్రధాన రోడ్డు విశాలంగా మారనుంది. నెల రోజులుగా రోడ్డు విస్తరణ, సీసీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జగదాంబసెంటర్ నుంచి గోవింద్‌సెంటర్ మీదుగా మహబూబాబాద్ క్రాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా పనులు సాగుతున్నాయి. రూ.కోటి నిధులతో 900 మీటర్ల పొడవు ఇరువైపులా సీసీ నిర్మాణం సాగుతోంది. వ్యాపార కూడళ్ల వద్ద రద్దీగా ఉండే చోట బైక్‌లు, చిన్న చిన్న వాహనాలు పార్కింగ్ చేయాలంటే కష్టంగా మారింది. ఇక రోడ్డు కింద మట్టి దుమ్ము, ధూళి ఉండటం, వాహనాలు రోడ్డు దిగినప్పుడు దుమ్ము లేచి ఇబ్బందిగా మారటం తరచుగా కనిపిస్తుంటుంది. ఇకముందు ఇలా ఉండబోదు. డ్రెయినేజీ మీద ఫుట్‌పాత్ నిర్మాణం కూడా చేపట్టబోతున్నారు. ఫుట్ పాత్ మీద టైల్స్ ఏర్పాటు చేసి పాదచారులు ఫుట్‌పాత్ మీద నడిచేలా తగు ఏర్పాట్లు చేయనున్నారు. రోడ్డుకు ఇరువైపులా విస్తరణ చేపట్టి, సీసీ నిర్మాణం చేయటం, డ్రెయినేజీ మీద ఫుట్ పాత్ నిర్మించడం వల్ల మట్టి కనిపించే అవకాశం ఉండదు. ప్రధాన రహదారి విశాలంగా ఉండటంతో పట్టణానికి కొత్త కళ రానుంది.

ఎంతో ఉపయోగం..



పట్టణంలో రోడ్డు విస్తరణ వల్ల ఎంతో ఉపయోగం ఉంది. పట్టణం పరిశుభ్రంగా ఉంటుంది. దుమ్ము, ధూళి కనిపించదు. రోడ్డు విశాలంగా ఉండటం వల్ల ప్రమాదాలు తప్పే అవకాశం ఉంది. కరెంట్ ఆఫీస్ నుంచి మహబూబాబాద్ క్రాస్ రోడ్డు, గుండాల వైపునకు 21 ఫీట్ వరకు రోడ్డుకు ఇరువైపులా విస్తరణ చేయాలి.

–నాళ్ల సోమసుందర్, కొత్త బస్టాండ్ ఏరియా

పనులు వేగంగా సాగుతున్నాయి..



ఏళ్లుగా ఎదురుచూస్తున్న పట్టణవాసుల కల నెరవేరుతోంది. రోడ్డు విస్తరణతో ప్రమాదాలు తప్పుతాయి. దుమ్ము, ధూళి ఇక్కట్లు ఉండవు. వ్యాపారులు ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకోవచ్చు. రూ.కోటి నిధులతో చేపడుతున్న ఈ పనులు వర్షాలు మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

–డి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

పాలిసెట్‌లో ర్యాంకులు



ఆర్.సంవర్షిని | సీహెచ్.జాహ్నవి | ఎండీ హసీనా | ఎం. హర్షిణి | సందీప్ చక్రవర్తి

ఇల్లెందు: పాలిసెట్‌లో ఇల్లెందు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. సోమవారం వెల్లడైన ఫలితాల్లో ఇల్లెందు శ్రీగురుదత్త కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఆర్.సంవర్షిని 1968వ ర్యాంకు, సీహెచ్ జాహ్నవి 2,124, ఎండీ హసీనా 2,202, ఎం.హర్షిణి 2,218, అర్వపల్లి సందీప్ చక్రవర్తి 2,284, పూనెం జస్వంత్ 3,530, వై.లక్ష్మీశ్రీజ 4,784, తన్మయ్‌కుమార్ 5,005వ ర్యాంకు సాధించారని సంస్థ నిర్వాహకులు కుంచాల శ్రీనివాస్, పుట్టా విజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో పాటు ఎంసీ నాగిరెడ్డి, అర్వపల్లి రాధాకృష్ణ, యాదగిరి రాంబాబు, వి.మహేందర్, రామకృష్ణ, సర్వేశ్వరరావు, తుమ్మలపల్లి ప్రసాద్, వెంకటస్వామి, శ్రీనివాసరావు, నామా సుధాకర్, దండా రాంచందర్ తదితరులు అభినందించారు.

ఓసీలో ప్రమాదాలపై అవగాహన



మాట్లాడుతున్న పీఓ బొల్లం వెంకటేశ్వర్లు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకేఓసీలో ప్రమాదాలపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో కొన్నేళ్లుగా జూన్‌లో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ దఫా ప్రమాదాల నివారణ కోసం ప్రతీ ఉద్యోగికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు విధుల్లో జాగ్రత్తగా ఉండాలని, యంత్రాల పని గంటలు పెంచాలని, సేఫ్టీ మెటీరియల్ ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో గని మేనేజర్ పూర్ణచందర్, ఇంజనీర్ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, బొల్లెద్దుల శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పిస్తున్న మామిడి సీజన్

పచ్చడి ముక్కలు కొట్టి జీవనోపాధి



పచ్చడి ముక్కలు కొడుతున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవి వచ్చిందంటే మామిడి కాయల పచ్చడి హడావుడి ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరం అకాల వర్షాలు, భారీ ఈదురు గాలులతో పచ్చడి మామిడి కాయల కొరత ఏర్పడింది. సీజనల్ వ్యాపారాలు చేసే వారు మామిడిపండు, పచ్చి మామిడి కాయలు అమ్ముతారు. పల్లెటూర్లలో మామిడికాయ పచ్చడి పెట్టే రోజు పండుగ వాతావరణం ఉండేది. క్రమేపి ఆధునిక సమాజంలో ఆ పరిస్థితి కనుమరుగైంది. పట్టణ ప్రాంతాల్లో పచ్చడి పెట్టడం ఒక భాగమైతే మామిడి కాయలను ముక్కలుగా కొట్టడం ఒక కళ. అంతసమయం లేదా ముక్కలు కొట్టే ఓపిక ప్రస్తుతం ఉండటం లేదు. దీంతో పచ్చడి ముక్కలు కొట్టి జీవనోపాధి పొందేవారు కూడా పెరిగారు. చిన్న కాయను బట్టి జలాలు వంటి పెద్ద కాయ ముక్కలు చేయడానికి ఒక్కొక్క దానికి రూ.3 నుంచి రూ.10 వరకు తీసుకుంటారు. కొత్తగూడెం రైతుబజారులో కొన్ని కుటుంబాలు పచ్చడి మామిడి కాయలను ముక్కలు కొట్టి జీవనోపాధి పొందుతున్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

ఖర్జూరాను మరిపించే ఈతపండ్లు



ఈతపండ్లను విక్రయిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: ప్రకృతి ప్రసాదించిన పండ్లు ఈత పండ్లు. వీటిని తింటే ఖర్జూర పండ్లు తిన్నట్లుగానే ఉంటాయి. కానీ కేజీ రూ.190 నుంచి రూ.200 వరకు విక్రయిస్తుండటంతో ప్రజలు వామ్మో అంటున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో చెరువుకట్టలు, అటవీ ప్రాంతంలో ఈతచెట్లు విరివిగా ఉంటాయి. ఇవి ఎత్తుతక్కువగా ఉండి చెట్టు మొత్తం ముళ్లతో ఉంటుంది. ఏటా వేసవికాలం చివరిలో మే, జూన్ నెలల్లో ఈతపండ్లు లభిస్తాయి. ఒక్క గెలకు వందల సంఖ్యలో ఖర్జూర పండ్లు ఉంటాయి. అరుదుగా లభించే ఈతపండ్లను కొత్తగూడెం, ములకలపల్లి, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి కొందరు గీత కార్మికులు గెలలను కోసి గడ్డిలో రెండు, మూడు రోజులు మాగపెడతారు. తర్వాత పండ్లుగా మారిన వాటిని విక్రయిస్తున్నారు. మరికొందరు చెట్టుమీదనే ఈతకాయలు పండిన తర్వాత గెలలను కోసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వీటిని తినడానికి ఆసక్తి చూపుతున్న పలువురు ధర ఎక్కువైనా వెనుకాడడం లేదు. మరోపక్క వేసవిలో ఈత పండ్ల అమ్మకంతో పలువురికి ఉపాధి లభిస్తోంది.

సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న సిబ్బంది

సింగరేణి (కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలో సీనియర్ సెక్యూరిటీగా నియమితులై, బాధ్యతలు చేపట్టిన వి.శ్రీనివాసరావును సోమవారం సెక్యూరిటీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షడ్రక్‌బాబు మాట్లాడుతూ.. గతంలో శ్రీనివాసరావు సీనియర్ సెక్యూరిటీ గార్డుగా నియమితులైన సమయంలో ఏరియాలో కోల్ ట్రాన్స్‌పోర్ట్ సమస్యలను పరిష్కరించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా బొగ్గు రవాణా జరిగేలా చూశారని తెలిపారు. ఏరియలో దొంగతనాలను అరికట్టి లక్షల రూపాయల సింగరేణి సొత్తును రికవరీ చేశారని, ఏరియాలో ప్రతి సెక్యూరిటీ సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాతం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ సినిమా విడుదలను నిలిపివేయాలి

కొత్తగూడెంఅర్బన్: 'హమ్ దో హమారే బారా' అనే హిందీ సినిమాను విడుదల కాకుండా ఆపాలని మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకుబ్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 7వ తేదీన విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ముస్లింలను కించపరిచేలా ఉన్నదని, టీజర్‌లో పవిత్ర ఖురాన్ వాక్యానికి తప్పుడు వాక్యాన్ని జోడించి దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

ఉరివేసుకుని కార్పెంటర్ ఆత్మహత్య

పాల్వంచ: ఉరి వేసుకుని కార్పెంటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని వెంగళరావుకాలనీకి చెందిన తాటికొండ నాగప్రసాద్ (35) సోమవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య ఉష, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

లారీ పట్టివేత

పాల్వంచరూరల్: అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. మండల పరిధిలోని తోగ్గూడెం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా రేంజర్ అనిల్‌కుమార్ పట్టుకుని లారీ యజమాని వెంకట్‌రెడ్డిపై కేసు నమోదుచేశారు.

కలెక్టర్‌కు వినతి

ములకలపల్లి: కుల బహిష్కరణ, గ్రామస్తుల దాడి విషయంలో ములకలపల్లి మండలం చాపరాలపల్లి ఎస్సీకాలనీకి చెందిన గద్దల బ్లెసీనా, రాజు దంపతులు కలెక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

కమ్యూనిస్టుల ఆశయం గొప్పది..



మాట్లాడుతున్న పి.సోమయ్య

ఇల్లెందు: భారత సమాజాన్ని కమ్యూనిస్టు ఆశయంగా మార్చాలనే లక్ష్యంతో సీపీఎం పనిచేస్తోందని, కానీ, తాము అనుసరించే మార్గం కఠినంగా ఉంటుందని ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, ఏజే రమేశ్ తెలిపారు. సోమవారం ఇల్లెందు సీపీఎం కార్యాలయంలో జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే సీపీఎం లక్ష్యమని, ఆకలి చావులు, మనిషిని మనిషి దోచుకునే స్వరూపం, నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలు, కార్పొరేట్ల దోపిడీ, దుష్ట రాజకీయాలు కమ్యూనిస్టుల పాలనలో ఉండవని స్పష్టం చేశారు. చైనా, క్యూబా, వియత్నాం, వెనెజులా లాంటి దేశాల్లో కమ్యూనిస్టుల పాలన ఉందని, పదేళ్లుగా కేరళలో సీపీఎం అధికారంలో ఉందని, దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఆ రాష్ట్రం ఉందని వెల్లడించారు. శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా అబ్దుల్ నబీ వ్యవహరించగా.. తాళ్లూరి కృష్ణ, మోహన్ రావు, సంధ్య, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి బడిబయట పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాలలకు అనుబంధంగా ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి శాఖ కృషి చేయాలని, అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించగలిగే అనుభవం ఉన్న ఉపాధ్యాయుల సేవలను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రజలతో సమావేశమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో విధిగా పాల్గొని సహకరించాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఏటీడబ్ల్యూఓ రూపాదేవి, డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే సమస్యలు



పనిచేయని బోరును చూపిస్తున్న నాయకులు

టేకులపల్లి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు భూక్య లాలునాయక్ ఆరోపించారు. సోమవారం సంఘం నాయకులతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ఉన్నారో లేరో అర్థం కావడం లేదని, సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. టేకులపల్లి ట్యాంకుబజారు, భీంసింగ్‌తండాతోపాటు వాగొడ్డుతండా అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న హ్యాండ్ బోర్ పనిచేయడం లేదని, అంగన్వాడీ కేంద్రం వద్ద వర్షపు నీరు నిల్వ ఉంటోందని పేర్కొన్నారు. ప్రభుత్వ బోర్లను కొందరు తమ సొంతానికి వాడుకుంటున్నారని తెలిపారు. సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. టేకులపల్లి మూడ్‌హుస్సేన్ నాయక్, బాణోత్ నరేశ్, మెమరీ పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీకి సత్కారం



సీఎండీని సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సీఎండీ బలరాంకు ట్రిపుల్‌ఐఈ వారు ప్రతిష్టాత్మక పెర్ఫార్మెన్స్ ఎక్సలెన్స్ అవార్డ్ - 2024ను ప్రకటించారు. సోమవారం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎండీని ఆయన చాంబర్‌లో కలిసి సన్మానించారు. కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు సమస్యలను పరిష్కరించాలని, ఎలక్షన్ కోడ్‌అయిన వెంటనే గుర్తింపుపత్రం అందజేయాలని కోరారు. సీఎండీ సానుకూలంగా స్పందించారు. వంగా వెంకట్, జి.వీరస్వామి, రమణమూర్తి, క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

సింగరేణిలో పెనాల్టీలు రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఇఫ్టూ నాయకులు

టేకులపల్లి: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు పెనాల్టీలు రద్దు చేసి, జీతాలు పెంచాలని ప్రగతి శీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలి డిమాండ్ చేశారు. సోమవారం ఇఫ్టూ ఇల్లెందు బ్రాంచ్ కమిటీ పిలుపులో భాగంగా టేకులపల్లి సింగరేణి హైటెక్ కాలనీలో సివిల్ సూపర్‌వైజర్ రాజేశ్‌కు కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఏడేళ్లుగా తమకు జీతాలు పెంచలేదని, కాంట్రాక్టు కార్మికుల ఇన్సూరెన్స్ సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పాయం వెంకన్న, షేక్ షఫీ, బాలు, నాగమణి, ఉప్పలయ్య, పుల్లయ్య, మంగయ్య, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిరండి..



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని గుగులోతు రాజేశ్‌నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ సమీపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలను స్థానిక గిరిజనులతో భర్తీ చేయాలని, ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించిన నేపథ్యంలో ఏజెన్సీ డీఎస్సీ, జనరల్ డీఎస్సీ అని రెండు రకాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కేశవ్‌నాయక్, సేవాలాల్ సేనా జిల్లా నాయకులు హరినాయక్, నరసింహ, రవి, హనుమంతు, కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సన్మానం

జూలూరుపాడు: తెలంగాణ ఉద్యమకారులను ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని మాచినేనిపేటతండాకు చెందిన ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నాయకుడు లకావత్ గిరిబాబు సహా పలువురు సన్మానం అందుకున్నారు.



సన్మానం అందుకున్న వారితో నాయకులు